నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | ఆదివారం 4 ఫిబ్రవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు

కాల్చి చంపిన వారే కన్నీరు పెట్టినట్లుంది..

రూ కోటి మంజూరు చేసి రూ. 5 కోట్లు దుబారా చేసిన్రు

- మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్ విమర్శలు మానుకోవాలి
- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ధ్వజం

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, ఫిబ్రవరి 3: ఇంద్రవెల్లిలో కాల్చి చంపినవారే కన్నీరు పెట్టినట్లుందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావుతో కలిసి విలేకరుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంద్రవెల్లిలో ఆ రోజు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంతో వేలాది మంది ఆదివాసులను పొట్టన పెట్టుకున్నారని, ఇప్పుడు ఏ హక్కు ఉందని సభ పెట్టి అమరులకు నివాళులర్పించారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరు చేసిన నిధులను, తాము చేసినట్లు గొప్పలు చెప్పుకోవడం కేవలం ఆదివాసుల ఓట్ల కోసమేనని పేర్కొన్నారు. సీఎం హోదాలో వచ్చి కేవలం రూ. కోటి మంజూరు చేసి, సభకు మాత్రం రూ. 5కోట్లు దుబారా చేశారని ఆరోపించారు. 2014లో మొదటిసారి సీఎం హోదాలో వచ్చిన కేసీఆర్ రూ. 25 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. రెండోసారి వచ్చినప్పుడు కుమ్రం భీం పేరిట జిల్లాను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఈ ప్రాంతానికి ఎంతో చేసిన కేసీఆర్‌పై సీఎం నోరుపారేసుకోవడం సరికాదని మండిపడ్డారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై చిన్న మాట కూడా మాట్లాడలేదని ఎద్దేవా చేశారు. మాజీ సీఎం కేసీఆర్ లేకుంటే రాష్ట్రం ఏర్పాటయ్యేదా.. ఈ రోజు రేవంత్ రెడ్డి సీఎం అయ్యేవారేనా అని ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. విమర్శలు మానుకొని అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే సక్కు మాట్లాడుతూ ఆదివాసీలకు పోడు భూమి పట్టాలు ఇచ్చి, రైతు బంధు కల్పించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని గుర్తు చేశారు. దండారీ, గుస్సాడీకి నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఎన్నికల హామీ 6 గ్యారెంటీలను పూర్తిగా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ కారణంగానే ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందని, ఇకనైనా సీఎం రేవంత్ రెడ్డి తన భాష మార్చుకోవాలని హితవుపలికారు. ఎంపీపీ మల్లికార్జున్, బీఆర్ఎస్ నాయకులు మల్లేశ్, గంధం శ్రీనివాస్, వెంకన్న, బాలేశ్ గౌడ్, కుమార్ ఉన్నారు

ఫిబ్రవరి 6న జిల్లాకు హరీశ్‌రావు

జిల్లాకు ఫిబ్రవరి 6న సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు రానున్నట్లు ఎమ్మెల్యే కోవ లక్ష్మి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించి, అనంతరం పార్టీ సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వేళకే పంపినా.. వెనక్కి..

మిల్లులకే రిటర్న్ చేరిన 13 సీఎంఆర్ వాహనాలు

- ఎఫ్‌సీఐ అధికారుల నిర్లక్ష్యమే కారణం
- గడువులోగా చేరినా మూడు రోజులుగా స్టాండింగ్‌లోనే...
- సీరియల్ మిస్ చేసి కొన్నింటి అన్‌లోడ్
- ఆన్‌లైన్ లాక్ కావడంతో మరికొన్ని నిలిపివేత
- తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 3: మంచిర్యాలలోని ఎఫ్‌సీఐ(ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా గడువులోగా కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్)ను మిల్లర్లు పంపినా ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వానికి సీఎంఆర్ పెట్టేందుకు జనవరి 31వ తేదీ ఆఖరు కాగా మిల్లర్లు సాధ్యమైనన్ని ఏసీకేలు ఎఫ్‌సీఐకి పంపించారు. అయితే వీటిలో 13 ఏసీకేల బియ్యం లారీలు ఇంకా ఎఫ్‌సీఐ లోపల, బయట దించకుండా ఉండిపోయాయి. గడువు లోపు పంపినా అధికారుల నిర్లక్ష్యం మిల్లర్లకు ఇబ్బందికరంగా మారింది.

ఎఫ్‌సీఐలో ఆగి ఉన్న బియ్యం లారీలు (ఫైల్)

వెనక్కి పంపించడంతో ఖాళీగా ఉన్న ఎఫ్‌సీఐ ఆవరణ

హమాలీలను పంపినా..

ఎఫ్‌సీఐలో బియ్యం బస్తాలు అన్‌లోడింగ్ చేయడానికి హమాలీ కాంట్రాక్టర్ నారాయణ సరిపడా హమాలీలను సిద్ధం చేయాలి. గడువు కారణంగా మిల్లర్లు పోటీపడి బియ్యం ఎఫ్‌సీఐకి పంపించారు. జనవరి 30న సుమారు 34 ఏసీకేల బియ్యం, 31న 43 ఏసీకేల బియ్యం వచ్చింది. అయితే హమాలీల కొరత ఉండడంతో, ఆయా మిల్లుల్లో పని చేసే సుమారు 50 మందిని ఎఫ్‌సీఐకి పంపించారు. అయినా ఫలితం లేకుండా పోయింది.

సీరియల్ మిస్ చేసి దించిన వైనం..

ఎఫ్‌సీఐకి వేబిల్‌లతో వచ్చిన లారీల వే బిల్‌లు తీసుకొని సీరియల్ ప్రకారం అన్‌లోడింగ్ చేయించాల్సి ఉంటుంది. అయితే ఎఫ్‌సీఐ అధికారులు కాకుండా లారీ అసోసియేషన్‌కు చెందిన పాషా, శ్రీధర్ వే బిల్లులు కలెక్ట్ చేశారు. ఈ క్రమంలో మిల్లర్లకు చెందిన వాహనాలు కాకుండా వారికి చెందిన వాహనాలను ముందస్తుగా అన్‌లోడ్ చేయించుకున్నారని, మిగతా లారీల వే బిల్లులు కూడా ఇంకా వారి వద్దే ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే వాహనాలు సీరియల్ తప్పి దించుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సీరియల్ తప్పించడంతో జనవరి 30వ తేదీన వచ్చిన లారీల్లో సుమారు నాలుగు అన్‌లోడ్ కాలేదు. 31వ తేదీన వ్యాగన్ రావడంతో, రాత్రి వరకు దానిని నింపే పనిలో హమాలీలో నిమగ్నమయ్యారు. ఆ తర్వాత లారీల్లో నుంచి దింపినా దాదాపు తొమ్మిది వాహనాలు అన్‌లోడ్ చేయకుండా వదిలేశారు. బియ్యం బస్తాలు దించుదామన్న ఆన్‌లైన్ లాక్ కావడంతో ఆపేశారు. దీంతో మొత్తంగా 13 ఏసీకేల బియ్యం లారీల్లోనే ఉండిపోయింది.

వెనక్కి పంపించిన అధికారులు..

ఈ విషయం బయటకు పొక్కకుండా ఉండేందుకు ఎఫ్‌సీఐ అధికారులు వాహనాలను వెనక్కి పంపించారు. ఒకసారి ఎఫ్‌సీఐకి వచ్చిన బియ్యం రిజక్ట్ అయితే వెనక్కి పంపాలి కానీ అధికారుల తప్పిదం బయటకు వస్తుందని యాజమానులు, మిల్లర్లపై ఒత్తిడి తీసుకువచ్చి ఎఫ్‌సీఐ నుంచి వాహనాలను తిరిగి పంపించినట్లు మిల్లర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలా వెనక్కి పంపించడం వల్ల రవాణా భారం తోపాటు సీఎంఆర్ బకాయి సైతం ఎక్కువ చూపిస్తుందని వాపోతున్నారు.

ఆర్డర్ వస్తేనే అన్‌లోడింగ్

జనవరి 31వ తేదీ అర్ధరాత్రి కాంటా ఆన్‌లైన్ ఆగిపోయింది. వ్యాగన్ రావడంతో హమాలీలు వ్యాగన్‌ను పంపించి లారీలను దించారు. తిరిగి ఆర్డర్ వస్తేనే ఆన్‌లోడింగ్ జరుగుతది. ఏదైనా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చేంత వరకు ఆగాల్సి ఉంటుంది. మరాడించిన బియ్యాన్ని ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా పెడితే ఆఖరు రోజు ఇలాంటి సమస్య రాదు.

- చంద్రమోహన్, ఎఫ్‌సీఐ డిపో మేనేజర్, మంచిర్యాల

స్వామివారి కల్యాణ పత్రిక అందజేత

కలెక్టర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఈవో, సభ్యులు

దండేపల్లి, ఫిబ్రవరి 3: దండేపల్లి మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 18 నుంచి సత్యదేవుడి కల్యాణ బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. 21న జరుగనున్న స్వామి వారి కల్యాణానికి హాజరు కావాల్సిందిగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌ను ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికలు అందజేశారు.అనంతరం శేషవస్త్రాలతో సన్మానించారు. ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సంపత్‌స్వామి, నారాయణశర్మ, నాయకులు గడ్డం త్రిమూర్తి, సిబ్బంది ఉన్నారు.


జాతర జరిగే గోదావరి తీరంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

జాతరలో ఇబ్బందుల్లేకుండా చూడాలి

అధికారులకు ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆదేశం

మంచిర్యాలటౌన్/సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 3: మంచిర్యాల గోదావరి తీరం, సీసీసీ ముక్కిడి పోచమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేయనున్న సమ్మక్క జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆదేశించారు. శనివారం ఆయన రెండు చోట్ల ఏర్పాట్లను పరిశీలించారు. జాతరలో ముఖ్యంగా పారిశుధ్యం, ట్రాఫిక్ సమస్యలు, తాగునీరు, వీధిదీపాలు, లైటింగ్, స్నానఘట్టాలు, ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. సీసీసీలో సింగరేణి అధికారులతో మాట్లాడారు. సింగరేణి అధికారులు రఘుకుమార్, అరవింద రావు, కాంతారావు, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ సతీశ్, పూజారి సాతూరి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

మంచిర్యాల పట్టణంలోని రైల్వే ఓవర్‌బ్రిడ్జిపై రోడ్డు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, ఏఈ రాజేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్‌రాథోడ్, ఎస్ఐ రాజేందర్, విద్యుత్ శాఖ ఏడీఈ రేగుంట స్వామి ఉన్నారు.

బీమా చెక్కును అందజేత

మంచిర్యాలకు చెందిన బొద్దుల శ్రీనివాస్ ఇటీవలే ప్రమాదంలో మృతిచెందాడు. గాయత్రి బ్యాంకులో సేవింగ్స్ ఖాతాదారుడు కావడంతో, ఆయన భార్య శిరీషకు రూ.లక్ష ప్రమాద బీమా చెక్కును ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు అందజేశారు. బ్రాంచ్ ఇన్‌చార్జి ప్రవీణ్, కౌన్సిలర్ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 3: టీఆర్ఎస్వీ నాయకులు, క్యాతనపల్లి మున్సిపాలిటీ 4వ వార్డు సోషల్ మీడియా అధ్యక్షుడు పవన్ తండ్రి సునాకర్ బాపు ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని శనివారం రాత్రి మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు బాల్క సుమన్ పరామర్శించారు. బాపు చిత్రపటానికి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. 15వ వార్డు ఇన్‌చార్జి పాల్ రాజ్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. 12వ వార్డు కౌన్సిలర్ బొద్దుల రమ్య ప్రేమ్‌సాగర్ అత్తమ్మ రాధ అనారోగ్యంతో మృతి చెందారు. కౌన్సిలర్ రమ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

సునాకర్ బాపు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

ఆర్టీసీ బస్సు టైర్ రాడ్ విరిగి..

- డ్రైవర్ చాకచక్యంతో తృటిలో తప్పిన ప్రమాదం
- ప్రమాద సమయంలో 55 మంది ప్రమాణికులు

రాడ్ విరిగి అదుపుతప్పి రోడ్డు దిగిన బస్సు

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 3: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలంలో ఓ ఆర్టీసీ బస్సు రన్నింగ్‌లో ఉండగా ఒక్కసారిగా వీల్ రాడ్డు విరిగింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. మండలంలోని కర్జెల్లి, గూడెం ప్రధాన రహదారిపై శనివారం మధ్యాహ్నం ఈ ఘటన చోటు చేసుకుంది. ఆసిఫాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (ఏపీ29జడ్2076) మహారాష్ట్రలోని అహెరికి వెళ్లి తిరిగి డిపోకు వస్తోంది. కర్జెల్లి దాటిన తర్వాత ఒక్కసారిగా బస్ స్టీరింగ్‌కు అనుసంధానంగా ఉండే వీల్ రాడ్డు విరిగి పోయింది. దీంతో అదుపుతప్పి రోడ్డు పక్కకు దిగింది. బస్సులో ప్రయాణిస్తున్న 55 మంది ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కానీ డ్రైవర్ చాకచక్యంగా బస్సును కంట్రోల్ చేసి బస్సును నిలిపివేశాడు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

వీసీకి హాజరైన కలెక్టర్ హేమంత్ సహదేవరావు

పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

మంత్రి ధనసరి అనసూయ(సీతక్క)

ఆసిఫాబాద్ టౌన్/నస్పూర్, ఫిబ్రవరి 3: గ్రామపంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి,స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ (సీతక్క) అన్నారు. ములుగు కలెక్టరేట్ నుంచి వీసీ ద్వారా హైదరాబాద్ నుంచి ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి అధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో గ్రామపంచాయతీల అభివృద్ధిపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రత్యేకాధికారుల పాలన ద్వారా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రానున్న వేసవి లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసిఫాబాద్‌లో కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, డీపీవో ఉమర్ హుస్సేన్, డీఆర్డీవో సురేందర్ కలిసి పాల్గొన్నారు. ఆసిఫాబాద్‌క లెక్టర్ మాట్లాడుతూ అన్ని గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించామని తెలిపారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మంచిర్యాలలో కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్, డీపీవో, డీఆర్డీవో ఉన్నారు.

తునికాకు సేకరణపై సందిగ్ధం

- వన్యప్రాణుల సంరక్షణ నేపథ్యంలో నిషేధం?
- ఇప్పటికే ప్రభుత్వానికి అటవీశాఖ ప్రతిపాదన
- వేలాది మంది కూలీల ఉపాధిపై ప్రభావం

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): జిల్లాలో వేసవి కాలంలో వేలాది మందికి ఉపాధి కల్పించే తునికాకు సేకరణపై ఈ ఏడాది సందిగ్ధం నెలకొంది. జిల్లాలో పులుల సంచారం, ఇటీవల కాగజ్‌నగర్ అడవుల్లో జరిగిన ఘటనల నేపథ్యంలో టైగర్ జోన్ పరిధిలో తునికాకు సేకరణ నిలిపివేయాలని గతంలోనే అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఈ మేరకు త్వరలోనే ఓ నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. ఇక జిల్లాలో కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ డివిజన్ల పరిధిలో పదిరేంజ్‌లు ఉన్నాయి. వీటి పరిధిలోని కల్లాల్లో ఏటా 20 వేల స్టాండర్డ్ బ్యాగుల తునికాకు సేకరణ జరిగేది. వేసవిలో పేద కుటుంబాలు ఈ ఆకు సేకరణపై రెండు నెలల పాటు జీవించేవి. ఉదయమే అడవులకు వెళ్లి తునికాకు సేకరించి, కట్టలు కట్టి కల్లాల్లో అమ్ముకొని ఉపాధి పొందేవారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఆకుని కాంట్రాక్టర్లు కొనుగోలు చేసేవారు. దీంతో ఒక్కో కుటుంబం దాదాపు రూ.20వేల నుంచి రూ.30వేల వరకు ఆదాయం అందేది. దీని ద్వారా ప్రభుత్వానికి కూడా లాభాలు వచ్చేవి. ఈ లాభాల్లో నుంచి కూలీలకు కూడా బోనస్ ఇచ్చేవారు. గతేడాది జిల్లాకు బోనస్ కింద దాదాపు రూ. 36 లక్షలు వచ్చాయి. ఒక్కో కూలీకి రూ. 5 వేల నుంచి రూ. 10 వేల వరకు అందింది. జిల్లాలో గత నాలుగేళ్లుగా తునికాకు సేకరణపై అటవీ శాఖ నిషేధం విధిస్తున్నది. దీంతో ఏటా కల్లాల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. గతంలో కొందరు ప్రజాప్రతినిధులు అటవీ శాఖపై ఒత్తిడి తెచ్చి తునికాకు సేకరణ జరిగేలా చర్యలు తీసుకున్నారు. గతేడాది కూడా పులి సంచారం ఎక్కువగా లేని అటవీ ప్రాంతాల్లో సేకరణకు అనుమతినిచ్చారు. గతంలో జిల్లాలో 25యూనిట్లు ఉండేవి. కవ్వాల్ టైగర్ జోన్ తర్వాత, గతేడాది కేవలం 9యూనిట్లలో మాత్రమే టెండర్లు నిర్వహించారు. ఈ ఏడాది ఈ యూనిట్లలో అయిన కొనసాగిస్తారా.. లేదా అనేది సందిగ్ధంలో పడింది.

తునికాకు కట్టలు కడుతున్న గిరిజనులు (ఫైల్)

సిజేరియన్లు పూర్తిగా తగ్గించాలి

- మంచిర్యాల డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు
- మూడు ప్రత్యేక బృందాలతో ప్రైవేటు దవాఖానల తనిఖీ
- 12 మంది ప్రభుత్వ వైద్యాధికారులకు మెమోలు

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

మంచిర్యాల ఏసీసీ, ఫిబ్రవరి 3: జిల్లాలోని ప్రైవేటు దవాఖానల్లో పూర్తి స్థాయిలో సిజేరియన్ కాన్పులను తగ్గించాలని మంచిర్యాల డీఎంహెచ్‌వో డా.జీ. సుబ్బారాయుడు అన్నారు. శనివారం జిల్లా సమీకృత కలక్టరేట్ కార్యాలయంలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో వైద్య, ఆరోగ్యశాఖ కమిషనర్‌తో ప్రసవాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ సిజేరియన్ కేసులు ప్రైవేటు దవాఖానల్లో ఎక్కువవుతున్నందున, మూడు ప్రత్యేక బృందాలు ఏరాపటు చేసి, తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 14 ప్రైవేటు దవాఖానలను ఈ బృందాలు సందర్శించి సీ సెక్షన్ పైన నివేదిక తయారు చేసి ఇవ్వాలని అదేశాలిచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే ఎంసీహెచ్‌లో వ్యాధినిరోదక టీకాలు, క్షయా వ్యాధి (ఎన్‌టీఈపీ), సికిల్‌సెల్ ఎనిమియా, ఎన్‌సీడీ (అసంక్రమణ వ్యాధులు, ఆయుష్మాన్‌భవ) పై పీహెచ్‌సీ వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు.

వైద్యాధికారులకు మెమోలు..

ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల లక్ష్యాలను చేరుకోనందున, వివరాల నమోదు, ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్ చేయనందున జిల్లాలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ 12 మంది వైద్యాధికారులకు శనివారం మెమోలను ఇచ్చారు. ఇందులో హాజీపూర్, రాజీవ్‌నగర్, శంషీర్‌నగర్, తాండూర్, నస్పూర్, అంగరాజ్‌పల్లి, దండేపల్లి, పాతమంచిర్యాల, జైపూర్, మందమర్రి, భీమిని, జన్నారం ఆరోగ్య కేంద్రాలకు జారీ చేశారు.

ఆన్‌లైన్‌లో ఇన్‌స్పైర్ ప్రదర్శనలను న్యాయనిర్ణేతలతో పాటు పర్యవేక్షిస్తున్న డీఈవో యాదయ్య

ఆన్‌లైన్‌లో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ పోటీలు

రాష్ట్రస్థాయి పోటీలకు పది మంది ఎంపిక

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 3 : జిల్లాలో 2022-23 విద్యా సంవత్సరానికిగాను 102 మంది విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్ అవార్డుకు ఎంపిక కాగా, వీరందరికీ డీఈవో యాదయ్య ఆధ్వర్యంలో శనివారం ఆన్‌లైన్ ద్వారా జిల్లా స్థాయి పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవోమాట్లాడుతూ డిసెంబర్ 20వ తేదీ నుంచి జనవరి 31 వరకు విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టుల వీడియోలు, వాటికి సంబంధించిన ఫొటోలు తదితర వివరాలను ఇన్‌స్పైర్ మనక్ కాంపిటీషన్ యాప్‌లో నమోదు చేశారు. వీటిని జాతీయ ఇన్నేవేషన్ ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్) ప్రతినిధులు అభిలాష్, శుభ్రత్ నేతృత్వంలో స్థానిక, గుజరాత్ రాష్ట్రాల నుంచి న్యాయనిర్ణేతలు సంయుక్తంగా ఈ నెల 1, 2 తేదీల్లో పరిశీలించినట్లు తెలిపారు. వీరిలో పది మంది విద్యార్థులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. వీరి పేర్లను జిల్లా సైన్స్ అధికారి మధుబాబుతో కలిసి డీఈవో శనివారం సాయంత్రం వెల్లడించారు. పొట్లపల్లి నరేష్ (జడ్పీఎస్ఎస్ అచ్చులాపూర్), మైదం స్ఫూర్తి (జడ్పీఎస్ఎస్ అచ్చులాపూర్), తేజావత్ విజయ్ (జడ్పీఎస్ఎస్ కిష్టాపూర్), షేక్ సాధిక్ (మంచిర్యాల జడ్పీఎస్ఎస్ బాలుర), కొమ్మెర శ్రీవత్స (చిన్నమున్ని స్కూల్, చెన్నూర్), బామండ్లపల్లి హర్షిత (జడ్పీఎస్ఎస్ అచ్చులాపూర్), విఘ్నేశ్వర్ సామాల (జడ్పీఎస్ఎస్ దౌడపల్లి), సుష్మిత (జడ్పీఎస్ఎస్ వీగాం), సైదం రవళి (కేజీబీవీ మంచిర్యాల), అక్కల ప్రశాంత్ (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఎస్ బాలుర తాండూరు) ప్రాజెక్టులు ఎంపికయ్యాయని తెలిపారు. వీరందరూ త్వరలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. తమ ప్రాజెక్టును మరింత మెరుగుపర్చుకొని జాతీయ స్థాయికి ఎంపికై రాణించాలన్నారు.

ఆరోగ్యం అన్నింటికన్నా విలువైన సంపద

మాట్లాడుతున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సూరెపల్లి నంద

నస్పూర్, ఫిబ్రవరి 3: ఆరోగ్యం అన్నింటికన్నా విలువైన సంపద అని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సూరెపల్లి నంద అన్నారు. నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో శనివారం దియాలి బాయ్‌లాల్‌చంద్ చారిటుబల్ ట్రస్టు తరపున వ్యవస్థాపక చైర్మన్ దయానంద్ గౌరి ద్వారా హైదరాబాద్‌లోని మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి, రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్, రోటరీ క్లబ్ ఆఫ్ స్మార్ట్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కోర్టుల యూనిట్, కలెక్టరేట్ సిబ్బంది, న్యాయవాదులు, ప్రజల కోసం నిర్వహించిన మెగా వైద్య శిబిరం, న్యాయ అవగాహన శిబిరాలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు, కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి న్యాయమూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సంతోషంగా జీవించాలన్నారు. జిల్లాలో మెగా వైద్య శిబిరం, న్యాయ అవగాహన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి నారాయణ దవాఖానకు చెందిన వైద్యులు 650 మందికి బ్రెస్ట్ సర్జికల్, ఓరల్ క్యాన్సర్ పరీక్షలు, ఈసీజీ, 2డీఏకో పరీక్షలతో పాటు ఈఎన్‌టీ, గైనిక్, పల్మోనాలజీ, ఇతర పరీక్షలు నిర్వహించారు. డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్, శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి, ఆదిలాబాద్ జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షురాలు మాధవి శాసనకోట, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అర్పితా మారంరెడ్డి, జిల్లా సివిల్ న్యాయ మూర్తులు సంపత్, ఉపనిషధ్వని, అసదుల్లా షరీఫ్, ముకేశ్, రవి, డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు పాల్గొన్నారు.